# మాటలో మెలిక

- గుమ్మా ప్రసాదరావు

ఓ పర్యాయం శ్రీ నడిమింటి సర్వమంగళశాస్త్రి గారు విజయనగరం సంస్థానాధీశులు శ్రీ పూసపాటి ఆనంద గజపతిరాజు గారి దర్శనార్థమై వచ్చారు. ఆ రాజుగారు కవి పండితుడ్ని సాదరంగా ఆహ్వానించి తమ రాకకు కారణమేమని ప్రశ్నించారు.



"మహారాజా! నాకుపనయనం, నా కుమారుని వివాహానికి తమరు యథోచితంగా సహాయం చేయగలరన్న కోరికతో వచ్చాను" అన్నారు శాస్త్రి గారు వినయంగా.

అక్కడ వున్న సభాసదులు, మంత్రులే కాదు రాజు గారు కూడా ఆ మాటలకు ఆశ్చర్య చకితులయ్యారు.

ఏమిటి శాస్త్రి గారు తనకుపనయనం అంటున్నారు. అంతటితో సరిపోయిందా? తన కుమారుడికి వివాహం కూడా అంటున్నారు. ఇది కడు విచిత్రంగా ఉందే! అందరి ఆశ్చర్యానికి అదే హేతువు.

"తప్పక. అయితే తమరు రేపు దయ చేయండి" అన్నారు రాజా వారు ఏమీ తేల్చుకోలేక.

"మహా సంతోషం" అంటూ శాస్త్రిగారు నిష్క్రమించారు.

"ప్రభువులు గమనించారా!? శాస్త్రిగారు అస్తమించే వయసు వచ్చే సరికి మాట తడబడుతున్నారు. వారు తన పునర్వివాహం, కుమారుడి ఉపనయనం అని అనడానికి మారుగా తన కుమారుడికి వివాహం, తనకు ఉపనయనం అన్నారు" అన్నాడొక మంత్రి. తానెంతో కుశాగ్రబుద్ధినని అతని అభిప్రాయం.

రాజు గారికి మాత్రం శాస్త్రి గారు పొరపాటుగా అని ఉండలేదనిపించింది. అయితే దాని తాత్పర్యం ఆయన ఊహ కందలేదు.

కొందరు మంత్రి గారిని సమర్థించారు.

"బహుశా మీరు ఊహించినది యథార్థం కాగలదు. కానివ్వండి. రేపు శాస్త్రి గారు వస్తారుగా.

తరువాయి

అప్పుడు చూద్దాం" అన్నారు రాజు గారు.

మరునాడు శాస్త్రి గారు ఆస్థానానికి వచ్చారు.

సభలో ఉత్కంఠ అధికమైంది. శాస్త్రి గారి పొరపాటును రాజుగారు ఎత్తి చూపుతారా? ఎంతటి రాజు అయినా శాస్త్రి గారిని అధిక్షేపించే సాహసం చేయలేరు, ఏమంటే సర్వమంగళ శాస్త్రి గారు సామాన్యుడు కాదు. ఆ రెండు కార్యక్రమాలకు శాస్త్రి గారు ఆశిస్తున్నది ధనమే కాబట్టి రాజావారు ఏమీ ప్రశ్నించకుండా ఆర్థిక సహాయం చేస్తారా ? శాస్త్రి గారికి కోపం తెప్పించకూడదని అలా చేస్తే శంక శంకగానే మిగిలిపోతుందే!

సభాసదుల ఉత్కంఠకు అదే కారణం.

ఆనంద గజపతి రాజు గారి కనుసన్నలతో దాసీ జనం రెండు వెండి పళ్ళెరముల మీద జరీ గుడ్డలు కప్పి తీసుకువచ్చారు.

"శాస్త్రి గారూ మీ కుమారుడి వివాహ సందర్భంగా ఈ పళ్ళెరంలోని ధనం మేం కట్నంగా సమర్పించుకుంటున్నాం" అన్నారు ఆనంద గజపతి రాజు.

"మహా ప్రసాదం" అంటూ స్వీకరించారు శాస్త్రి గారు.

సభికులకు ఆ విషయం తెలుసు.

కాని రెండవ పళ్ళెరం మీదే వారి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

"శాస్త్రి గారూ! ఈ పళ్ళెరంలో మీరు వాంఛించిన ఉపనయనాలు మూడు జతలున్నాయి. అందులో ఏదో ఒకటి మీ చూపుకి సరిపోవచ్చుననే మేం అనుకుంటున్నాం. స్వీకరించండి" అన్నారు.

శాస్త్రి గారు కోరింది అవే. రాజు గారు గ్రహించి బహూకరించినవీ అవే.

ఉపనయనం - అంటే కళ్ళజోడు.

సభ కరతాళధ్వనులతో మారుమ్రోగింది.

○

## గాలి భూతం

కలుషితం కాని ప్రదేశమంటూ
ఎక్కడుంది?
ఒకప్పటి వాయుదేవుడు నేడు
ఏ శుభ్రతా లేని భూతం
వలయానిలాలు, సుగంధాల్ని మోసే మంద
పవనాలు
ఏనాడో కరువయ్యాయి
ఇంటా బయటా దుర్గంధమే
ఒంటిలోనూ వంటింట్లోనూ గ్యాసు
వాసనలు
కిటికీ తెరిస్తే
ఘాటు వాసనల అక్రమ ప్రవేశం
పొద్దుటి నడకవేళ చల్లని పిల్లగాలులేవీ?
పొద్దస్తమానం వాహనాల పొగ కక్కుడు
యంత్రాలకన్నిటికీ వింత వాత రోగం
పంపు తెరిస్తే క్లోరిన్ కంపు
అమ్మలాంటి చెట్లని కొట్టేస్తుంటే
చెడ్డగాలిని భోంచేసే దిక్కెవ్వరు?
మలినమైపోయిన గాలి దొంగ
ఎక్కడ ఏ రంధ్రమున్నా దూరిపోతాడు
భూమ్యాకాశాల మధ్య
పెనుభూతమై పీడిస్తోంది వాయువు
గుక్కెడు నీళ్లని కూడా
కొనుక్కునే రోజులొచ్చేశాయ్
ముక్కెడు మంచి గాలిని
కొనుక్కునే రోజులూ వస్తాయేమో!

*- ఆర్వీయస్ సుందరం*